


BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్




సంపుటి - 01 సంచిక - 46 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 19-02-2026 గురువారం పేజీలు : 6




## క్యాతనపల్లిలో హైటెన్షన్

### : మాజీ ఎంపీ బాల్క సుమన్ అరెస్ట్!

మంచిర్యాల (బిఎన్ఎస్ ): మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం కేతనపల్లిలో గత 24 గంటలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు పోలీసులు తెరదించారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిన్నటి నుంచి చోటుచేసుకున్న వరుస పరిణామాలు, ఆందోళనలతో కేతనపల్లి ప్రాంతం ఒక్కసారిగా రణరంగంగా మారింది.

అసలేం జరిగింది?

స్థానిక సమస్యలపై నిరసన తెలిపేందుకు కేతనపల్లికి చేరుకున్న బాల్క సుమన్ మరియు బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. నిన్నటి నుంచి ఈ రోజు సాయంత్రం వరకు ఇరు వర్గాల మధ్య తోపులాటలు, వాగ్వాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో పోలీసులు భారీగా మోహరించి, లాఠీచార్జ్ చేసే అవకాశం ఉందన్న హెచ్చరికల నడుమ సుమన్‌ను అదుపులోకి తీసుకున్నారు

2 లో

## క్యాతనపల్లిలో పొలిటికల్ వార్

### : రౌడీయిజం చేస్తే సహించేది లేదు - మంత్రి

మంచిర్యాల (బిఎన్ఎస్):మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపాలిటీలో గత రెండు రోజులుగా సాగుతున్న ఉత్కంఠ భరిత రాజకీయ పరిణామాలు పరాకాష్టకు చేరాయి. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల వేళ ఉద్రిక్తతలు రణరంగాన్ని తలపించాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా, దీనిపై మంత్రి వివేక్ వెంకటస్వామి మీడియా సాక్షిగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ఓటమి భయంతోనే దాడులు: మంత్రి వివేక్ : ఘటనపై స్పందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, బాల్క సుమన్ తీరుపై విరుచుకుపడ్డారు. "ఎన్నికల్లో ఓటమిని అంగీకరించలేక బాల్క సుమన్ రౌడీలా ప్రవర్తిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం, కానీ వీధి రౌడీల్లాగా అధికారులపై, ప్రజాప్రతినిధులపై దాడులు చేయడం సిగ్గుచేటు" అని విమర్శించారు.

2 లో




## 18 ఏళ్లు వస్తే, 4 సార్లు

## ఓటు హక్కు నమోదుకు అవకాశం

- కేంద్ర చట్టంతో అనుసంధానం చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరపున శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి కందుల దుర్గేష్
- ఈ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్న శాసనసభ్యులు లోకం నాగ మాధవి, ఎన్. ఈశ్వరరావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి
- ఓటర్ల జాబితాలో అక్రమాలను తొలగించి, పారదర్శకమైన జాబితాను రూపొందించాలని సూచన

## వనస్థలిపురంలో దారుణం

### విడాకులు ఇచ్చిందని భార్యపై పగ..

### నడిరోడ్డుపై కత్తితో పొడిచి హత్య!




హైదరాబాద్ (బిఎన్ఎస్): వనస్థలిపురం పరిధిలో గురువారం సాయంత్రం ఒక కిరాతక ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్య సునిత విడాకులు ఇచ్చి దూరంగా ఉంటుందన్న కక్షతో, ఒక ఉన్మాది ఆమెపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణాలు తీశాడు. జనసంచారం ఉన్న ప్రాంతంలోనే ఈ ఘాతుకం జరగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.

## 22ఏ జాబితా భూముల తొలగింపు మరింత సరళతరం

ఇంఛార్జ్ మంత్రులు, జిల్లా కలెక్టర్లతో కలిసి ప్రత్యేక డ్రైవ్

పేదలకు లబ్ది చేకూరేలా నిషేధిత జాబితా భూములపై నిర్ణయం.

అసెంబ్లీ సమావేశాల్లో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్




## దుష్ప్రచారానికి చెక్

- క్రికెట్ మ్యాచ్ ఖర్చులు నా సొంతమే..
- మంత్రి నారా లోకేష్ క్లారిటీ




అమరావతి(బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ తన వ్యక్తిగత పర్యటనలపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారానికి ఘాటుగా సమాధానమిచ్చారు. ఇటీవలి భారత్–పాకిస్థాన్ మ్యాచ్ వీక్షించేందుకు ఆయన ప్రభుత్వ ఖర్చులతో వెళ్లారంటూ కొన్ని వర్గాలు చేసిన విమర్శలపై లోకేష్ స్పష్టతనిచ్చారు. ఈ పర్యటనకు సంబంధించిన విమాన టికెట్లు, మ్యాచ్ టికెట్లు మరియు ఇతర ఖర్చులన్నీ తన సొంత నిధుల నుంచే వెచ్చించినట్లు ఆయన వెల్లడించారు.

## హెరిటేజ్ నెయ్యిపై చర్చకు భయమెందుకు?

### ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత నిప్పులు

అమరావతి (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో అధికార, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న పోరు మరింత ముదిరింది. హెరిటేజ్ నెయ్యి సరఫరా అంశంపై చర్చకు పట్టుబట్టిన తమ గొంతు నొక్కేస్తున్నారని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు.




## రాజ్యసభ ఎన్నికల నగారా: మార్చి 16న పోలింగ్..

### తెలంగాణలో రెండు స్థానాలకు షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. తెలంగాణలోని రెండు స్థానాలతో పాటు మొత్తం 10 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.




తెలంగాణలో ఖాళీ అయ్యే స్థానాలు

తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేఆర్ సురేష్‌రెడ్డి (బిఆర్ఎస్), మరియు అభిషేక్ మను సింఘ్వీ (కాంగ్రెస్ ) పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ 9తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

## కోవూరు సీహెచ్‌సీ ని 100 పడకల హాస్పిటల్ గా అప్‌గ్రేడ్ చేయండి

- కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలవాసుల వైద్య సేవలకు కోవూరులోని CHC మాత్రమే ఆధారం.
- పెరిగిన జనాభా, వైద్య అవసరాలకు ప్రస్తుతమున్న వైద్యశాల సరిపోవడం లేదు.
- 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుతాయి.
- శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.




## నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### హస్తినలో రాజకీయ సెగలు.. కేబినెట్ విస్తరణపై క్లారిటీ?




హైదరాబాద్/న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీ పర్యటనకు వెళు_న్నారు. రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్న తరుణంలో, ముఖ్యమంత్రి హస్తిన పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ అధిష్టానంతో భేటీ కావడమే కాకుండా, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చించనున్నారు.

పర్యటనలోని ప్రధానాంశాలు:

కేబినెట్ విస్తరణపై కసరత్తు: తెలంగాణ మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీపై అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది.

## సాగర తీరాన నౌకా దళ విన్యాసం

### : విశాఖలో రాష్ట్రపతి 'ఫ్లీట్ రివ్యూ'

భారత్ సముద్ర బలగాలకు 70 దేశాలు సలాం.. అదిరిన యుద్ధనౌకల విన్యాసాలు ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్



# 18 ఏళ్లు వస్తే, 4 సార్లు ఓటు హక్కు నమోదుకు అవకాశం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో నేడు'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ సవరణ బిల్లు - 2026' కు ఏకగ్రీవ ఆమోదం లభించింది. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖామాత్యులు కొణిదల పవన్ కళ్యాణ్ తరపున పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులందరూ బిల్లును స్వాగతించారు.

బిల్లులోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే గతంలో పంచాయతీరాజ్ సంస్థల్లో ఓటు హక్కు పొందడానికి కేవలం జనవరి 1వ తేదీని మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారు. దీనివల్ల జనవరి 2న 18 ఏళ్లు నిండిన యువత మరో ఏడాది వేచి చూడాల్సి వచ్చేది. తాజా సవరణ ప్రకారం, ఏడాదికి నాలుగు సార్లు (జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, మరియు అక్టోబర్ 1) ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పించారు. అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కేంద్ర చట్టం ఇప్పటికే ఈ నాలుగు తేదీల విధానాన్ని అమలు చేస్తోంది. మున్సిపాలిటీల్లో కూడా ఇదే విధానం ఉంది. ఇప్పుడు పంచాయతీరాజ్ సంస్థలను కూడా వీటికి అనుసంధానించడం ద్వారా రాష్ట్రంలో ఒకే విధమైన ఓటర్ల జాబితా విధానం అమల్లోకి వస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం డిసెంబర్ 23, 2025న ఈ అంశంపై ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో దీనికి శాసనసభ చట్టబద్ధత కల్పించింది.

ఈ బిల్లుపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు లోకం నాగ మాధవి (నెల్లిమర్ల), ఎన్. ఈశ్వరరావు (ఎచ్చెర్ల), గోరంట్ల బుచ్చయ్య చౌదరి (రాజమహేంద్రవరం రూరల్) పాల్గొన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలను తొలగించి, పారదర్శకమైన జాబితాను రూపొందించాలని వారు సూచించారు. సభ్యుల సూచనలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

సభ్యులందరి ఆమోదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ సవరణ బిల్లు - 2026కి ఆమోదం పొందినట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ప్రకటించారు.

# 22ఏ జాబితా భూముల తొలగింపు మరింత సరళతరం

అమరావతి: 22ఏ నిషేధిత జాబితా నుండి భూములను తొలగించే ప్రక్రియను మరింత సరళతరం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం శాసనసభలో టిడిపి ఎమ్మెల్యే కొలికలపూడి శ్రీనివాసరావు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు భూ ఆక్రమణ, 22ఏ జాబితా నుండి తొలగింపు అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి అనగాని సమాధానమిస్తూ 22ఏ నిషేధిత జాబితా నుండి ప్రయివేట్ భూములను తొలగించేందుకు ఇప్పటికే మెమోను జారీ చేశామని, ఇందులో ఐదు రకాల భూములను నిషేధిత జాబితా నుండి తొలగించే అవకాశాన్ని కల్పించామని చెప్పారు. ఈ సందర్భంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు కలుగజేసుకొని 22ఏ నిషేధిత భూముల సమస్య రాష్ట్ర మంతా ఉందని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం కూడా మంచి మార్గదర్శకాలు కూడా ఇచ్చిందని, ఇవి అమలయ్యేలా చూడాలని మంత్రి అనగానిని కోరారు. దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందిస్తూ 22ఏ నిషేధిత జాబితా నుండి ప్రయివేట్ భూముల తొలగింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తామన్నారు. తమ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తాను, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకుంటూ ఒక టీమ్ గా ఏర్పడి 22ఏ భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తున్నామని చెప్పారు. పేదలకు లబ్ధి జరిగేలా, సామాన్యులు నష్టపోకుండా ఉండేలా 22ఏ నిషేధిత భూముల సమస్యను పరిష్కరించమని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు మార్గనిర్దేశం చేశారని, తాము ఆ దిశగా పని చేస్తున్నామని చెప్పారు. జిల్లా స్థాయిలో 22ఏ భూముల తొలగింపునకు ఇచ్చిన ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేసేందుకు ఇంఛార్జ్ మంత్రులు, జిల్లా కలెక్టర్లు ప్రత్యేక డ్రైవ్ చేపడతారని చెప్పారు. తిరువూరు మండలంలోని రామన్న పాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 22 లో ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణపై ప్రశ్న అడగగా ఆ భూములకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయని, కోర్టు తీర్పు వచ్చేంతవరకు ఎదురు చూడాల్సి ఉందన్నారు. అలాగే విశాఖలో మాజీ సైనికోద్యోగులకు అసైన్డ్ చేసిన భూముల అమ్మకాలకు సంబంధించి బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన భూములను పదేళ్ల తర్వాత వారు గానీ, వారి వారసులు గానీ అమ్ముకోవచ్చని, అయితే అలా కేటాయించిన భూముల్లో నీటి వనరులు ఉంటే కొన్ని సుప్రీంకోర్ట్, హైకోర్టు తీర్పుల రీత్యా, రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చిన ఆదేశాల ప్రకారం వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని, అందుకే వాటిని నిషేధిత జాబితాలో పెట్టినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# సాగర తీరాన నౌకా దళ విన్యాసం

## : విశాఖలో రాష్ట్రపతి 'ఫ్లీట్ రివ్యూ'

విశాఖపట్నం (బిఎన్ఎస్): 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖ సాగర తీరం బుధవారం ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదికైంది. భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్, గౌరవ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ నావికాదళ సమీక్ష దేశ సైనిక సత్తాను ప్రపంచానికి చాటిచెప్పింది. సుమారు 70 దేశాలకు చెందిన ప్రతినిధులు, 60కి పైగా యుద్ధనౌకలు పాల్గొన్న ఈ మెగా ఈవెంట్‌లో భారత నౌకాదళం తన అజేయ శక్తిని ప్రదర్శించింది.

విన్యాసాల పర్వం - అతిథుల సందడి

ఉదయం 9.40 గంటలకు ప్రారంభమైన ఈ సమీక్షలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐఎన్ఎస్ సుమిత్ర నుంచి నౌకాదళాన్ని పర్యవేక్షించారు. ఈ అద్భుత ఘట్టానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.

ప్రధాన ఆకర్షణలు ఇవే:

ఐఎన్ఎస్ విక్రాంత్ హోరు: దేశీయంగా తయారైన విమానవాహక నౌక 'ఐఎన్ఎస్ విక్రాంత్' ఈ సమీక్షలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనిపై నుంచి జరిగిన యుద్ధ విమానాల టేకాఫ్, ల్యాండింగ్ విన్యాసాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

మారిటైమ్ పరేడ్: భారత నౌకలతో పాటు అమెరికా, రష్యా, జపాన్ వంటి మిత్ర దేశాల యుద్ధనౌకలు రాష్ట్రపతికి గౌరవ వందనం సమర్పించాయి.

కమెండోల విన్యాసం: మార్కోస్ కమెండోలు సముద్రం మధ్యలో హెలికాప్టర్ల నుంచి జారడం, శత్రు నౌకలను స్వాధీనం చేసుకునే తీరును ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నారు.

వసుధైవ కుటుంబకం.. సముద్రాల ద్వారా ఐక్యం

సందర్భోచితంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. "ఈ అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కేవలం సైనిక ప్రదర్శన మాత్రమే కాదు, ఇది దేశాల మధ్య నమ్మకానికి, గౌరవానికి చిహ్నం. 'వసుధైవ కుటుంబకం' స్ఫూర్తితో సముద్ర మార్గాలను శాంతియుత వాణిజ్యానికి, భద్రతకు వేదికగా ఉంచడమే మన లక్ష్యం" అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ విశాఖపట్నం నౌకాదళానికి కీలక కేంద్రంగా ఎదగడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.

నగరం అంతా నీలిమయం

ఈ వేడుకల కోసం విశాఖ నగరం విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా వేలాది మంది ప్రజలు ఈ విన్యాసాలను తిలకించారు. ఫిబ్రవరి 19న జరిగే 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్' మరియు 20న నిర్వహించే 'కాన్క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాలతో ఈ నౌకాదళ ఉత్సవాలు ముగియనున్నాయి.

# కోవూరు సీహెచ్‌సీ ని 100 పడకల హాస్పిటల్ గా అప్‌గ్రేడ్ చేయండి

కోవూరు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా ప్రస్తుతం ఉన్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం శాసన సభలో ఆమె మాట్లాడుతూ.. కోవూరుతో పాటు విడవలూరు, కొడవలూరు మండలాలకు చెందిన దాదాపు 2 లక్షల మంది ప్రజలకు ఈ ఆసుపత్రే ప్రధాన వైద్య కేంద్రమని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 50 పడకల సామర్థ్యం ఏమాత్రం సరిపోవడం లేదని, దీనివల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ఆవేదన వ్యక్తం చేశారు.

కోవూరు పట్టణం భౌగోళికంగా ముంబై జాతీయ రహదారి (NH-16), కృష్ణపట్నం పోర్ట్ - బళ్లారి జాతీయ రహదారి (NH-67)ల మధ్య ఉండగా.. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆమె సభకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను అత్యవసరంగా నెల్లూరు తరలించే క్రమంలో ట్రాఫిక్ అంతరాయం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కోవూరులోనే 100 పడకల ఆసుపత్రి ఉంటే అత్యవసర వైద్య చికిత్సలందించి ప్రాణాలను కాపాడవచ్చని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సభ దృష్టికి తెచ్చారు.

కోవూరు హాస్పిటల్ లో డయాలసిస్ యూనిట్

కోవూరు ప్రాంత కిడ్నీ వ్యాధిగ్రస్తుల కష్టాలను ప్రస్తావిస్తూ నెల్లూరు GGHలో ఒకే డయాలసిస్ యూనిట్ ఉండడంతో రద్దీ కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత్యంతరం లేని పరిస్థితులలో ప్రైవేటు హాస్పిటల్స్ కు వెళ్లాల్సి వస్తుందని ఆమె వివరించారు. గ్రామీణ ప్రాంత వాసుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోవూరు ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కోవూరు ఆసుపత్రిని 100 పడకల హాస్పిటల్ గా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ వంటి స్పెషలిస్ట్ వైద్యుల సేవలు మరియు అధునాతన ల్యాబ్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. దీనివల్ల జిల్లా ప్రధాన ఆసుపత్రి (*GGH*) పై ఒత్తిడి తగ్గుతుందని ఆమె పేర్కొన్నారు.

# దుష్ప్రచారానికి చెక్: క్రికెట్ మ్యాచ్ ఖర్చులు నా సొంతమే.. మంత్రి నారా లోకేష్ క్లారిటీ

మొదటి పేజీ తరువాయి



సోషల్ మీడియా దుమారం - లోకేష్ వివరణ

కొలంబో వేదికగా జరిగిన హై-వోల్టేజ్ భారత్-పాక్ మ్యాచ్‌కు లోకేష్ హాజరైన ఫోటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో, "ప్రజల సొమ్ముతో మంత్రి విదేశాల్లో క్రికెట్ ఎంజాయ్ చేస్తున్నారు" అంటూ ప్రతిపక్షాలు మరియు కొందరు సోషల్ మీడియా వినియోగదారులు ఆరోపణలు గుప్పించారు. దీనిపై స్పందించిన లోకేష్, తాను కేవలం ఒక క్రికెట్ అభిమానిగా మాత్రమే అక్కడికి వెళ్లానని, ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా భారం వేయలేదని స్పష్టం చేశారు.

వార్తలోని కీలక అంశాలు:

సొంత ఖర్చులే: విమాన ప్రయాణం నుంచి స్టేడియం ఎంట్రీ టికెట్ వరకు ప్రతి పైసా తన వ్యక్తిగత ఆదాయం నుంచే చెల్లించినట్లు మంత్రి పేర్కొన్నారు.

క్రమశిక్షణకు నిదర్శనం: గతంలో కూడా తన అధికారిక పర్యటనలకు, పెట్టుబడుల ఆకర్షణ కోసం వెళ్ళిన విదేశీ పర్యటనలకు సైతం సొంత ఖర్చులే పెట్టుకున్న దాఖలాలు ఉన్నాయని టీడీపీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి.

ఆర్టీఐ వివరాలు: ఇటీవల ఆయన విమాన ప్రయాణాలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, ఆర్టీఐ ద్వారా వెల్లడైన వివరాలు కూడా లోకేష్ ప్రభుత్వ ఖజానాను వాడలేదని ధ్రువీకరించాయని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

రాజకీయ విమర్శలకు సమాధానం

రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న తరుణంలో, అప్పుడప్పుడు వ్యక్తిగత ఆసక్తితో క్రీడలను వీక్షించడం తప్పేమీ కాదని లోకేష్ మద్దతుదారులు వాదిస్తున్నారు. అనవసరమైన వివాదాలు సృష్టించి ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా ఇటువంటి పోస్టులు పెడుతున్నారని వారు మండిపడుతున్నారు. మంత్రి స్వయంగా వివరణ ఇవ్వడంతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.

# వనస్థలిపురంలో దారుణం

## : విడాకులు ఇచ్చిందని భార్యపై పగ.. నడిరోడ్డుపై కత్తితో పొడిచి హత్య!




హైదరాబాద్ (బిఎన్ఎస్): వనస్థలిపురం పరిధిలో గురువారం సాయంత్రం ఒక కిరాతక ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్య సునిత విడాకులు ఇచ్చి దూరంగా ఉంటుందన్న కక్షతో, ఒక ఉన్మాది ఆమెపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణాలు తీశాడు. జనసంచారం ఉన్న ప్రాంతంలోనే ఈ ఘాతుకం జరగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.

ఘటన వివరాలు:

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. నిందితుడు మరియు బాధితురాలు సునిత గత కొంతకాలంగా మనస్పర్ధల కారణంగా విడివిడిగా ఉంటున్నారు. చట్టపరంగా విడాకులు తీసుకున్న తర్వాత బాధితురాలు వనస్థలిపురంలో నివాసముంటోంది. అయితే, ఆమె తనను వదిలేసి వెళ్ళిందన్న కోపాన్ని పెంచుకున్న నిందితుడు, ఆమెపై పగ తీర్చుకోవాలని పథకం వేశాడు.

ఈ క్రమంలోనే మాటు వేసిన నిందితుడు, వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో ఒక్కసారిగా దాడికి దిగాడు. ఆమె కేకలు వేస్తున్నా వినకుండా గుండె, పొట్ట భాగంలో పలుమార్లు పొడవడంతో బాధితురాలు రక్తపు మడుగులో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది.

ఉద్రిక్తత మరియు పోలీసుల రాక:

అక్కడికక్కడే మృతి: తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితురాలు సునిత ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు విడిచింది.

నిందితుడి పరారీ: దాడి అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు: క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హంతకుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వనస్థలిపురం ఏసీపీ తెలిపారు.

కాలనీలో విషాదం:

విడాకులు ఇచ్చి స్వతంత్రంగా బతుకుతున్న మహిళను ఇలా దారుణంగా హత్య చేయడంపై స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. మహిళల రక్షణపై మరోసారి చర్చ మొదలైంది. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితురాలి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

# రాజ్యసభ ఎన్నికల నగారా: మార్చి 16న పోలింగ్.. తెలంగాణలో రెండు స్థానాలకు షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. తెలంగాణలోని రెండు స్థానాలతో పాటు మొత్తం 10 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.

తెలంగాణలో ఖాళీ అయ్యే స్థానాలు

తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేఆర్ సురేష్‌రెడ్డి (బిఆర్ఎస్), మరియు అభిషేక్ మను సింఘ్వీ (కాంగ్రెస్ ) పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ 9తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల కీలక తేదీలు (ముఖ్య సమాచారం):

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

నోటిఫికేషన్ విడుదల: ఫిబ్రవరి 26, 2026

నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ: మార్చి 5, 2026

నామినేషన్ల పరిశీలన: మార్చి 6, 2026

నామినేషన్ల ఉపసంహరణకు గడువు: మార్చి 9, 2026

పోలింగ్ తేదీ: మార్చి 16, 2026 (ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు)

ఓట్ల లెక్కింపు: మార్చి 16, 2026 (సాయంత్రం 5 గంటలకు)

పది రాష్ట్రాల్లో 37 స్థానాలు

తెలంగాణ (2)తో పాటు మహారాష్ట్ర (7), ఒడిశా (4), తమిళనాడు (6), పశ్చిమ బెంగాల్ (5), అసోం (3), బిహార్ (5), ఛత్తీస్‌గఢ్ (2), హర్యానా (2), హిమాచల్ ప్రదేశ్ (1) రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు ఈ షెడ్యూల్ వర్తిస్తుంది. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదలైన నాటి నుండి ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది.

# కేతనపల్లిలో హైటెన్షన్: మాజీ ఎంపీ బాల్క సుమన్ అరెస్ట్!

మొదటి పేజీ తరువాయి



ఉద్రిక్తతకు దారితీసిన పరిణామాలు:

నిరంతర పోరాటం: స్థానిక భూగర్భ గనుల సమస్యలు లేదా సింగరేణి ప్రభావిత ప్రాంతాల అంశంపై బాల్క సుమన్ నిన్నటి నుంచే ఆందోళన బాట పట్టారు.

భారీ పోలీస్ మోహరింపు: శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు కేతనపల్లి పరిసరాల్లో 144 సెక్షన్ విధించి, బయటి వ్యక్తులు రాకుండా ఆంక్షలు పెట్టారు.

కార్యకర్తల ఆందోళన: తన నాయకుడి అరెస్టును అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో తోపులాట జరిగి, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

అరెస్ట్ పర్వం: సాయంత్రం వేళ పోలీసులు బలవంతంగా బాల్క సుమన్‌ను వాహనంలోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు.

రాజకీయ సెగలు

ఈ అరెస్టును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని బాల్క సుమన్ అనుచరులు ఆరోపిస్తున్నారు. మరోవైపు, అనుమతి లేకుండా ఆందోళనలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నందుకే అరెస్ట్ చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

ప్రస్తుతం బాల్క సుమన్‌ను ఏ పోలీస్ స్టేషన్‌కు తరలించారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. కేతనపల్లిలో అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# క్యాతనపల్లిలో పొలిటికల్ వార్: రౌడీయిజం చేస్తే సహించేది లేదు - మంత్రి వివేక్ హెచ్చరిక



మంత్రి కాన్వాయ్‌పై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ, ఇలాంటి అరాచక శక్తులను చట్టపరంగా అణచివేస్తామని హెచ్చరించారు. క్యాతనపల్లి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అది జీర్ణించుకోలేకనే బీఆర్ఎస్ శ్రేణులు హింసకు దిగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

24 గంటల ఉత్కంఠ.. అరెస్టుతో ముగింపు

క్యాతనపల్లిలో నిన్నటి నుంచి ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల ప్రక్రియలో అధికార పక్షం జోక్యం చేసుకుంటోందని ఆరోపిస్తూ బాల్క సుమన్ తన అనుచరులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులతో తోపులాట, పరస్పర వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. పరిస్థితి విషమించడంతో ఈరోజు సాయంత్రం పోలీసులు రంగంలోకి దిగి బాల్క సుమన్‌ను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు.

రౌడీయిజంపై ఫైర్: "బిడ్డా.. నీ దమ్మెంతో చూపిస్తా" అంటూ గతంలో సుమన్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కౌంటర్ ఇస్తూ, గూండాయిజం చెల్లదని స్పష్టం చేశారు.

భారీ భద్రత: క్యాతనపల్లిలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మందమర్రి అంతటా బలగాలను మోహరించారు.

కేసుల నమోదు: ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, అల్లర్లను ప్రేరేపించడం వంటి ఆరోపణల కింద బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

మంత్రి వివేక్ వ్యాఖ్యలతో జిల్లా రాజకీయాలు మరింత వేడెక్కాయి. అరెస్టయిన సుమన్‌ను ఎక్కడికి తరలించారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతుండగా, మరోవైపు బీఆర్ఎస్ శ్రేణులు ఈ అరెస్టును ఖండిస్తూ నిరసనలకు సిద్ధమవుతున్నాయి.

# నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే ఆశావహుల జాబితా సిద్ధం చేసిన సిఎం, పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో దీనిపై తుది చర్చలు జరపనున్నారు.


రాష్ట్ర అభివృద్ధి నిధులు: విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు మరియు కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులపై పలువురు కేంద్ర మంత్రులను రేవంత్ రెడ్డి కలిసే అవకాశం ఉంది.

పొలిటికల్ అప్‌డేట్స్: రాష్ట్రంలో ఇటీవలి పరిణామాలు, ఇతర పార్టీల నుంచి చేరికలు మరియు పార్టీ సంస్థాగత మార్పులపై హైకమాండ్‌కు సీఎం నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం.

ఢిల్లీ వేదికగా కీలక నిర్ణయాలు?

ముఖ్యమంత్రితో పాటు పలువురు సీనియర్ నేతలు కూడా ఢిల్లీ వెళ్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావడం మరియు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అధిష్టానానికి వివరించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పర్యటన అనంతరం రాష్ట్ర కేబినెట్‌లో మార్పులు చేర్పులపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# జగనన్న పాలన భేష్ అంటున్న ప్రజలు -కాకాణి



నెల్లూరు జిల్లా పొదలకూరు(బి.యన్.యస్):– పొదలకూరు మండల కేంద్రంతో పాటు, విరువూరు, నేదురు మల్లి, గ్రామాలలో పర్యటించిన మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి

మాజీ మంత్రి కాకాణి కి ఘన స్వాగతం పలికిన గ్రామాల ప్రజలు,మహిళలు,

జగనన్న కిడ్నీ బాధితులకు ఇచ్చిన పదివేల రూపాయల పెన్షన్ తోనే తాను ఇంతకాలం జీవించగలిగానని కాకాణి ముందు భావోద్వేగానికి గురైన విరువూరు వాసి మహిమలూరు వెంకయ్య.

జగనన్న హయంలో మంజూరైన పెన్షన్లు, మంత్రిగా మీరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ,తాము ఎన్నటికీ మరువ లేమన్న నేదురుమల్లి గ్రామవాసులు కాకణి గోవర్ధన్ రెడ్డికి తెలిపారు. అదేవిధంగా

జగనన్న పాలనలో రైతులకు భరోసా ఉండేదని, కూటమి పాలనలో అష్ట కష్టాలు పడుతున్నామంటూ కాకాణి ఎదుట పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేసారు.అదేవిధంగాయూరియా కోసం అనేక ఇబ్బందులు పడి, ఎంతో శ్రమకోర్చి బ్లాక్ లో కొనుగోలు చేశామంటూ తమ బాధలను పలువురు రైతులు కాకాణి ఎదుట వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కాకణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ

మాజీ ముఖ్యమంత్రిజగన్మోహన్ రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేసి , రైతులకు అన్ని విధాల అండగా నిలిచారు అని పేర్కొన్నారు.

కూటమిపాలనలో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తూ, రైతులను అధోగతి పాలు చేస్తున్నారు అని

రైతాంగం యూరియా కోసం పడిన బాధలు వర్ణనాతీతం అని

రైతులు శ్రమించి పండించిన పంటకు, ప్రభుత్వం కనీసం మద్దతు ధర కల్పించాలి అని కోరారు.

జిల్లా యంత్రాంగం మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి, రైతుల దగ్గర ధాన్యం సేకరించకపోతే , రైతులు తీవ్రంగా నష్టపోతారు అని తెలిపారు.

ధాన్యం సేకరణ విషయంలో జిల్లా అధికారులు పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తే, రైతుల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడటానికి సిద్ధం అని తెలిపారు.అదేవిధంగా జగనన్న హయాంలో క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం, రెండుసార్లు అర్హత కలిగిన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారు అని కూటమి పాలన అధికారంలోకి వచ్చాక కొత్త పెన్షన్ల ఊసే లేకుండా అర్హులందరికీ మొండి చేయి చూపించారు అని మండి పడ్డారు.

ప్రజలలో జగన్మోహన్ రెడ్డి గారి హయాంలో జరిగిన అభివృద్ధి, చంద్రబాబు చేస్తున్న మోసాలపై విస్తృత స్థాయి చర్చ జరుగుతుంది అని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలందరూ జగనన్న పాలనను తిరిగి కోరుకుంటున్నారు అని తెలిపారు.

కూటమి ప్రభుత్వ పాలనలో ఇప్పటికే విసిగి వేసారి పోయిన ప్రజలు, చంద్రబాబును సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారు అని చెప్పారు. అదేవిధంగాచంద్రబాబు అభివృద్ధి ,సంక్షేమాన్ని, గాలికి వదిలేసి రోజుకో కొత్త పాట పాడుతూ, డైవర్షన్ పాలిటిక్స్ కు పూనుకుంటున్నాడు అని తెలిపారు.

అదేవిధంగాచంద్రబాబు నాయుడు ప్రవర్తిస్తున్న తీరు, మాట్లాడుతున్న విధానం చూసి, ప్రజలు అసహ్యించుకుంటున్నారు అని జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఎటువంటి కష్టం కలిగినా , కుటుంబ సభ్యులు లాగా అందరం కలిసి పోరాడుతాం అని

అధికారం ఉన్నా లేకపోయినా ప్రజలతో మమేకమవుతూ, ప్రజల అవసరాలు తెలుసుకొని పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తాం అని తెలిపారు.

# రైస్ మిల్లుకు వెళ్తున్న రేషన్ బియ్యం లారీ పట్టివేత

## రూ.10.8 లక్షల విలువైన 30 టన్నుల బియ్యం



రావులపాలెం...రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న సమాచారం రావడంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద ఎస్సై జి నరేష్ పట్టుకున్నారు. 30 టన్నుల బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారు. వాటిని పట్టుకుని ఆరా తీయగా రేషన్ బియ్యంగా వెల్లడయింది.విజయవాడ సమీపం నుంచి ఈ బియ్యాన్ని తీసుకొస్తున్నారు.ఈ బియ్యం విలువ సుమారు రూ. 10.8 లక్షలు ఉంటుంది. దీనిపై ఎస్ఐ నరేష్ బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ ఆకుల శివకృష్ణ మణికంఠ ను అరెస్టు చేశారు.కాకినాడకు చెందిన కె.చంద్రశేఖర్‌కు చెందిన లారీ గా గుర్తించారు. అయితే ఈ బియ్యం కాకినాడ వెళుతున్నట్లు వారు చెబుతున్నారు. కాని కోస్తా జిల్లాలోనే రేషన్ బియ్యం కొనుగోలు కేంద్రంగా ఉన్న ఆలమూరు మండలం మోదుకూరు రైస్ మిల్లులకు ఈ బియ్యం వస్తున్నట్లు సమాచారం.ఈ బియ్యాన్ని మండపేట మండలం వేములపల్లి గొడౌన్ లో దిగుమతి చేసి లారీని ఆలమూరు పోలీసు స్టేషన్ కు తరలిస్తామని మండల సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

# నక్కా వెంకటరత్నం ను పరామర్శించిన.. నేదురుమల్లి



ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు(బి.యన్. యస్):– ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని సైదాపురం మండలంకి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్కా వెంకటరత్నం సతీమణి నక్కా పద్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న వెంకటగిరి



నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి గూడూరు పట్టణంలోని జానకీరాం పేటలోని వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో సైదాపురం మండలం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్సు పథకాన్ని ఉపయోగించుకోండి

## -బీజేపీ రాపూరు మండల అధ్యక్షులు దూడల పెంచలయ్య




నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్) :-దేశం లోని అసంఘీటీత కార్మికులకోసం ప్రవేశపెట్టిన పథకం తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబం లోని ప్రతిఒక్కరు దీనికి అర్హులు ఈ కార్డు కలిగిన వారికీ ప్రమాద భీమా క్రింద 6 లక్షలు వరకు వర్తిస్తుంది, ప్రమాదంలో వికలాంగులుగా మారితే మూడు లక్షలు నుండి ఐదు లక్షల వరకు సహాయం అందుతుంది. అలాగే కుటుంబంలో ఇద్దరు అమ్మాయిలకు పెళ్లి కి 30 వేల రూపాయల చొప్పున 60 వేల రూపాయలు మరియు ఇద్దరు గర్భిణీ స్త్రీ లకు 30 వేల రూపాయల చొప్పున 60 వేల రూపాయలు సహాయం అందుతుంది, ఈ పథకం కోసం దగ్గరలోని లేబర్ ఆఫీసర్ ని సంప్రదించి ఈ ఇన్సూరెన్సు పథకానికి ధరఖాస్తూ చేసుకోండి.ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని రాపూరు మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దూడల పెంచలయ్య పత్రిక ప్రకటనలో తెలిపారు.

# నిందితుడు మృతి చెందడంపై జిల్లా ఎస్పి దీరజ్ కునుబిల్లి ప్రెస్ మీట్.





మదనపల్లి (బిఎన్ఎస్): బాలిక మృతి చెందిందన్న విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడు కులవర్దన్ ను అదుపులోకి తీసుకుని ప్రజలు నిందితుడిపై దాడి చేసే అవకాశం ఉండడంతో పోలీస్ స్టేషన్ కు రక్షక్ వాహనంలో తరలించే క్రమంలో ట్రాఫిక్ జాం అయిందన్నారు.ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించే క్రమంలో డ్రైవర్ ఒక్కడే వాహనంలో ఉండటం గమనించి నిందితుడు తప్పించుకున్నాడన్నారు. డ్రైవర్ ఒక్కడే ఉండటం వల్ల కులవర్దన్ సులువుగా తప్పించుకున్నాడని, నిందితుడి కోసం నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోయిందన్నారు. అయితే నేటి ఉదయం తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లు సమీపంలోని కనసానిపల్లి చెరువులో గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు సమాచారం అందించడంతో తమ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మృతుడు నిందితుడు కులవర్దన్ గా ధృవీకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొరకు మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారని వెల్లడించారు.

# శాంతియుతంగా జరుగుతున్న ఆర్ఎస్ఎస్ శాఖపై దాడి

## ఆర్ఎస్ఎస్ మహానగర్ సంఘ్ చాలక్ పీవీ నారాయణరావు



విశాఖపట్నం (బీఎన్ఎస్) : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్( ఆర్ఎస్ఎస్) దైనందిన కార్యక్రమాల్లో భాగమైన శాఖ ఎంతో కాలంగా ఆంధ్రా విశ్వవిద్యాలయం మైదానంలో ప్రశాంతంగా జరుగుతోంది. ఆర్ఎస్ఎస్ కు వందేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగానూ, విశాఖ నగరంలోనూ పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆర్ఎస్ఎస్ ఎదుగుదలను సహించలేని కొన్ని శక్తులు మంగళవారం రాత్రి ఆంధ్ర విశ్వవిద్యాలయం బాస్కెట్ బాల్ కోర్టు వద్ద జరుగుతున్న శాఖ పై దాడి చేశాయని ఆర్ఎస్ఎస్ మహానగర్ సంఘ్ చాలక్ పీవీ నారాయణరావు అన్నారు. దాడి జరుగుతున్న సమయంలో స్వయం సేవకులు భారతమాతను కీర్తిస్తూ ప్రార్థన చేస్తున్నారు. భారత్ మాతాకీ జై అంటూ ప్రార్థన చేస్తుండగా కొందరు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే విధంగా నినాదాలతో కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ సంఘ కార్యకర్తలు సమయమనం కోల్పోలేదు. పోలీసుల సమక్షంలో ఇదంతా జరిగింది అని ఆయన వివరించారు.

అయితే విచిత్రంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు విశ్వవిద్యాలయంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ కవాతు చేశారంటూ కొన్ని వర్గాలు విష ప్రచారానికి తెర తీశాయి. ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలన్నీ చట్టానికి లోబడి శాంతియుతంగానే జరుగుతాయి. ఎక్కడ హింసకు, విద్వేషాలకు తావు ఉండదు. ప్రశాంతంగా ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న శాఖపై దాడికి పాల్పడిన వారే ఆర్ఎస్ఎస్ తమపై దాడి చేసిందంటూ తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం అని నారాయణరావు అభిప్రాయ పడ్డారు. ఆర్ఎస్ఎస్ శాఖపై దాడి జరిగిందని తెలుసుకొని విశ్వవిద్యాలయంలోని ఏబీవీపీ విద్యార్థులు సంఘటనా స్థలానికి వచ్చి అండగా నిలబడ్డారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. విశాఖ తో పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రశాంతంగా ఉండాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటుంది .ఎటువంటి హింసకు ఆర్ఎస్ఎస్ అవకాశం ఇవ్వదని మరో మారు స్పష్టంగా తెలియజేస్తున్నాం అని ఆయన వివరించారు.

# ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని ర్యాలీ

## తాసిల్దార్‌కు వినతి పత్రం






బిఎన్ఎస్ న్యూస్ జఫర్ఘడ్ ఫిబ్రవరి 18: జఫర్గఢ్ మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి జువారి రమేష్ నేతృత్వంలో కార్యకర్తలు తాసిల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జువారి రమేష్ మాట్లాడుతూ, జఫర్గడ్, కోణాయిచలం, తమ్మడపల్లి ఐ గ్రామాలలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. అక్రమ ఆక్రమణదారులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వెంటనే స్పందించి ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అలాగే తమ్మడపల్లి ఐలో అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో భూములు, ఇండ్లు నిరుపేదలకు కేటాయించే కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సుధాకర్, సీనియర్ నాయకులు చంద్రమౌళి, మాజీ సర్పంచ్ ఉప్పునూతల మల్లయ్య, మహిళా సంఘం మండల నాయకురాలు ఎండి నూర్జిస, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎండి యాకూబ్ పాషా, కలకోట ప్రభాకర్, ఆరెల్లి రవి, వేల్పుల పెద్ద రాములు, చిలివేరి ఎల్లయ్య, నక్క బిక్షపతి, కొంతం రాజు,



ఉప్పునూతల యశోద, నక్క ఎల్లమ్మ, వడ్లకొండ సంపూర్ణ, వేల్పుల పద్మ, ఎండి రిజ్వానా, ఎండి పర్రిషా, మందపురి రజిత, బుల్లె సాయులు, యాకయ్య, ఎండి జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు బాధ్యతతో ఉండాలి.

## సమీక్ష సమావేశంలో మంత్రి పార్థసారథి.



నూజివీడు (బీఎన్ఎస్) : రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార మరియు పౌరసంబంధాలశాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి నూజివీడు నియోజకవర్గ ప్రగతిపై ఫోకస్ పెంచారు. అన్ని శాఖలపై మంత్రి వరుస సమీక్షలతో బిజీబిజీగా గడుపుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులకు మంత్రి సారథి సీరియస్ వార్నింగులే ఇస్తున్నారు. తీరు మార్చుకోకపోతే వేటు తప్పదని నిర్మొహమాటంగా ముఖం మీదే చెప్పేస్తున్నారు. తాజాగా ఈరోజు మంత్రిగారి క్యాంపు కార్యాలయంలో ఎస్టీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ మరియు నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి, నియోజకవర్గంలోని పీహెచ్‌సీలపై మంత్రి ఆకస్మిక రివ్యూ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , కూటమి ప్రభుత్వం ప్రజల సంతృప్తిని ప్రామాణికంగా తీసుకుంటూ పనిచేస్తోందని....ఈ విషయాన్ని అధికారులు గ్రహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కుదరదన్నారు.

గిరిజన విద్యార్థులంటే అంత నిర్లక్ష్యమేంటి? :

నూజివీడులోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం, బోధనకు సంబంధించిన అంశాలపై హాస్టల్ వార్డెన్ ను మంత్రి ఆరా తీశారు. కొన్ని ముఖ్యమైన విషయాలపై సంబంధిత వార్డెన్ మంత్రి ప్రశ్నించడంతో సదరు వార్డెన్ సమాధానాలు చెప్పలేక నీళ్లు నమలాల్సిన పరిస్థితి ఏర్పడింది. హాస్టల్ లో గిరిజన విద్యార్థుల సంఖ్య తగ్గడం ఏంటి? మీరు నిజంగా చిత్తశుద్ధితో పనిచేస్తే విద్యార్థుల సంఖ్య ఎందుకు పెరగదు? మీరు ఉద్యోగాలు చేస్తున్నారా, ఆడుకుంటున్నారా? మీరు సరిగ్గా పనిచేస్తే హాస్టల్ వైపు గిరిజన విద్యార్థులు తప్పకుండా వస్తారు....అంటూ వార్డెన్ నిర్లక్ష్యం పై మంత్రి నిప్పులు చెరిగారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారికి ఫోన్ చేసి వార్డెన్ నిర్వాకాన్ని వివరించారు. తక్షణమే నూజివీడు నియోజకవర్గంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్ల పరిస్థితులపై దృష్టి పెట్టాలని జిల్లా అధికారిని ఆదేశించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఎవ్వరినీ వదిలిపెట్టే పరిస్థితి ఉండదని వార్నింగ్ ఇచ్చారు.

# కోర్టు ఆదేశానుసారమే...భూదాన భూముల్లో పేదల ఇళ్లు




బిఎన్ఎస్ న్యూస్, ఖమ్మం పట్టణం / ఫిబ్రవరి 18, ఖమ్మం జిల్లా : కోర్టు ఆదేశానుసారం భూదాన భూముల్లో పేదలు ఇళ్లస్థలాలను నిర్మించుకున్నారని, వారికి వెంటనే నీటి వసతి, కరెంట్ సౌకర్యం తక్షణమే కల్పించాలని మాజీ హైకోర్టు న్యాయమూర్తి బి.చంద్రకుమార్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 2014లో వెలుగుమట్ల భూదాన భూమిని పేదల ఇళ్లస్థలాల కోసం కేటాయించబడిందని, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఆ ఇళ్లస్థలాలకు కనీస వసతులు ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం వారిని అక్కడ నుండి వెళ్లగొట్టేందుకు పోలీసుల ద్వారా బెదిరించే కార్యక్రమాలు చేయడం బాధాకరమని అన్నారు. భూదాన భూమిని కబ్జా చేసే ప్రయత్నంలో రాజకీయ నాయకులు ఉన్నట్లు ఆరోపించారు. అట్టి భూమి నుండి పేదలకు భయభ్రాంతులకు గురి చేసి వెళ్లగొడితే ఆ భూమిని కబ్జా చేసే అవకాశం ఉంటుందని అనుకోవడం అమాయకత్వమన్నారు. జిల్లా అధికారులు కోర్టు ఆదేశాలను అనుసరించి వెలుగుమట్ల భూదాన భూముల్లో ఇళ్లస్థలాలు ఏర్పాటు చేసుకున్న వారికి తక్షణమే సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఒత్తిడి మేరకు పోలీసులు ఒత్తిడి చేసి పేదలను వెళ్లగొట్టాలని చూస్తే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని, వారే బాధ్యులవుతారని హెచ్చరించారు. విజ్ఞతతో రాజ్యాంగం ప్రకారం కోర్టు అదేశాలను అనుసరించి వెలుగుమట్ల పేదలకు న్యాయం చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. భూదాన భూములను అమ్మే హక్కు, కొనే హక్కు ఎవరికీ లేవని స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా రాజకీయ నాయకులు, కొంతమంది అధికారులు వెలుగుమట్ల భూములను ఆక్రమిస్తే న్యాయస్థానం ముందు నిలబడక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో భారత, చైనా మిత్రమండలి ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ డాక్టర్ మోహన్ రెడ్డి, సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణ, తెలంగాణ ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి డి.విజయేందర్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు భద్రు నాయక్, బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఏసి నాయకులు రాంబాబు, యర్రా బాబు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచడమే లక్ష్యం : మంత్రి సవిత

అమరావతి(బిఎన్ఎస్ ) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, బజార్లు, వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోంది. పండగ సమయాల్లో భారీ డిస్కౌంట్లు అందజేస్తూ చేనేత వస్త్రాల వినియోగం పెంచడంతో పాటు నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పించడమే కాకుండా ఆదాయం ఆర్జించేలా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అసెంబ్లీకి, శాసనమండలికి వస్తున్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచే లక్ష్యంతో గురువారం నుంచి బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ ఆప్కో ఆధ్వర్యంలో 12 స్టాళ్లను చేనేత, జౌళి శాఖాధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తయారవుతున్న ప్రఖ్యాతగాంచిన చేనేత ఉత్పత్తులను ఈ స్టాళ్లలో విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. పొందూరు షర్ట్ లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలతో పాటు ఇంటిల్లపాది వినియోగించుకునే రెడీమేడ్ దుస్తులను ఈ స్టాళ్లలో అమ్మకానికి అందుబాటులో ఉంచనున్నారు. లుంగీలు, టవళ్లు, దుప్పట్లు, ఇతర చేనేత వస్త్రాలను సైతం అమ్మకానికి పెట్టనున్నారు. గురువారం ఈ స్టాళ్లను ప్రారంభించి, అమ్మకాలు ప్రారంభించనున్నారు. అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం పరిశీలించారు. ఏయే వస్త్రాలు విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే ప్రపంచ ప్రఖ్యాతగాంచిన చేనేత వస్త్రాలను, పట్టు చీరలను అమ్మకానికి పెట్టాలని చేనేత, జౌళి శాఖాధికారులకు మంత్రి సవిత ఆదేశించారు. చేనేత స్టాళ్లతో పాటు ఫొటో స్టాల్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. చేనేత దుస్తుల వినియోగం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు దంపతులు, మంత్రి నారా లోకేశ్ దంపతులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహా పలువురు ప్రముఖులు చేనేత ఎగ్జిబిషన్లు సందర్శన, వారు చేనేత వస్త్రాల కొనుగోలు చేసిన, ధరించిన దృశ్యాలను ఈ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. నేతన్నలతో సీఎం చంద్రబాబు నాయుడు సంభాషిస్తున్న దృశ్యాలు కూడా ఎగ్జిబిషన్లో ప్రదర్శనకు పెట్టారు.



చేనేత అమ్మకాలు పెంచడమే లక్ష్యం : మంత్రి సవిత

నేతన్నలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికవృద్ధి కలిగించడమే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి చేనేత వస్త్రాల అమ్మకం, వినియోగం పెంచేలా చేనేత ఎగ్జిబిషన్లు, బజార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏ చిన్న వేడుకగాని, పండుగాని వచ్చినా ప్రత్యేక డిస్కౌంట్లతో చేనేత దుస్తుల అమ్మకాలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఆప్కో ఆధ్వర్యంలో 12 చేనేత స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా గురువారం నుంచి వచ్చే నెల ఏడో తేదీ వరకూ ఈ స్టాళ్లు నిర్వహిస్తామన్నారు. చేనేత దుస్తుల వినియోగం పెంచడమే లక్ష్యంగా ఈ స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో వస్తుంటారన్నారు. వారంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడం ద్వారా, నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రజలంతా వారంలో ఒకరోజు చేనేత దుస్తులు ధరించడం ద్వారా సంప్రదాయమైన చేనేత వృత్తికి వెన్నుదన్నుగా నిలిచేవారవుతారని మంత్రి సవిత తెలిపారు.

# ఘనపూర్ స్టేషన్‌లో నూతన డివిజన్ కార్యాలయ భవనాల పరిశీలన





బిఎన్ఎస్ న్యూస్ స్టేషన్ ఘనపూర్,ఫిబ్రవరి 18: స్టేషన్ ఘనపూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న నూతనంగా నిర్మాణంలో ఉన్న డివిజన్ కార్యాలయాల సముదాయ భవనాన్ని పరిశీలించారు.నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, పనులు నాణ్యత ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో ఆర్ అండ్ బి శాఖ డివిజనల్ ఇంజనీర్ సతీష్ కుమార్, విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ సారయ్య, ఆర్ డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ భాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు.అధికారులు భవన నిర్మాణంలోని వివిధ విభాగాలను పరిశీలించి, అవసరమైన సాంకేతిక సూచనలు చేశారు.

# ఇంట్లో బాంబులా పేలిన ఫ్రిడ్జ్.. కాలి బూడిదైన వస్తువులు



ఏపీ న్యూస్, 18 ఫిబ్రవరి (బిఎన్ఎస్): ఇటీవల జోగులాంబ గద్వాల జిల్లాలో ఫ్రిడ్జ్ పేలి తల్లి, కుమారుడు మరణించిన సంగతి తెలిసిందే. ఇంటిముందు దుకాణంలోని ఫ్రిడ్జి పేలడంతో పక్కనే ఉన్న తల్లి, కుమారుడికి తీవ్రగాయాలై చనిపోయారు. కాగా ఏపీలోని పశ్చిమ గోదావరిలోనూ అలాంటి ఘటనే చోటు చేసుకుంది. మొగల్తూరు మండలం కొండవారిపాలెంలో ఓ ఇంట్లో ఫ్రిజ్ ఒక్కసారిగా పేలిపోయింది. ఫ్రిజ్ పేలడంతో ఇంట్లోని వస్తువులు అన్నీ కాలిపోయాయి, ఇల్లంతా పొగలు వ్యాపించడంతో ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు.

మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు వ్యాపించాయని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇక ఫ్రిజ్ ప్రమాదాలకు కంప్రెసర్ పై ఒత్తిడి కారణం అని నిపుణులు చెబుతున్నారు. ఏ మాత్రం తేడా వచ్చినా మెకానిక్ కు చూపించి రిపేర్ చేయించాలని సూచిస్తున్నారు. ఫ్రిజ్ లను గోడలకు మరీ అతుక్కుపోయేలా పెట్టకుండా కాస్త దూరంగా ఉండేలా చూడాలని సూచిస్తున్నారు.

## ఏపీలో ఏసీబీ రైడ్స్.. తప్పించుకుని పారిపోయిన ఎస్సై



ఏపీ న్యూస్, 18 ఫిబ్రవరి (బిఎన్ఎస్): రాష్ట్రంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలో వాత్సవాయి పోలీస్ స్టేషన్ లో సోదాలు నిర్వహించారు. అయితే ఈ దాడుల నుంచి ఎస్సై పరారయ్యారు. పోక్సో కేసులో బాధితుల నుంచి ఎస్ఐ లంచం డిమాండ్ చేశారు. దీంతో అధికారులను బాధితులు ఆశ్రయించారు. ఇప్పటికే భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు ఆధారాలు సైతం అధారాలు అందించారు. దీంతో పక్కా స్కెచ్ వేసి పోలీస్ స్టేషన్‌పై రైడ్స్ చేశారు. అయితే తనిఖీలకు ముందే కానిస్టేబుల్‌కు సమాచారం అందింది. వెంటనే ఎస్సైకు చెప్పడంతో ఆయన ఎస్కేప్ అయ్యారు.

## యువతకు స్పీకర్ అయ్యన్న కీలక పిలుపు



ఏపీ న్యూస్, 18 ఫిబ్రవరి (బిఎన్ఎస్): విద్యార్థులకు, యువతకు ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వీరి కోసం ఎన్నో సంక్షేమం కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పుడు ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తోంది. రాజకీయాల్లోకి రావాలని కోరుతోంది. ఇందుకోసం అసెంబ్లీలో జరిగే సమావేశాలను ప్రత్యక్షంగా తిలకించేందుకు అవకాశం కల్పించింది. ఇప్పుడు తాజాగా విద్యార్థులకు పోలవరాన్ని కూడా వీక్షించే అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులను పోలవరం కూడా తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తోంది. అటు యువతకు కూడా స్పీకర్ అయ్యన్న కీలక పిలుపునిచ్చారు. ఉద్యోగాలకు పరిమితం కాకుండా యువత రాజకీయాల్లో రావాలన్నారు. ప్రజలకు సేవ చేయాలంటే నాయకత్వం స్వీకరించాలని ఆయన కోరారు. కాగా 300 మంది స్కూలు, కాలేజీ విద్యార్థులు బుధవారం రోజు అసెంబ్లీని సందర్శించారు.

# సినిమా న్యూస్

## విజయ్ -రష్మిక పెళ్లి

### కానీ వాటికి నో ఎంట్రీ!




టాలీవుడ్ ఇండస్ట్రీలో బ్యూటిఫుల్ హీరోయిన్ రష్మిక మందాన, యంగ్ హీరో విజయ్ దేవరకొండ పెళ్లి చేసుకోబోతున్న సంగతి తెలిసిందే. చాలా రోజులుగా సీక్రెట్ గా రిలేషన్ లో ఉన్న ఈ జంట.. ఈ నెల చివరలో పెళ్లి పీటలు ఎక్కబోతోంది. ఫిబ్రవరి 26వ తేదీన విజయ్ దేవరకొండ, రష్మిక వివాహం జరగబోతున్నట్లు తెలుస్తోంది. ఉదయ్‌పూర్ వేదికగా వీళ్ల జంట పెళ్లి చేసుకోబోతుందట. ఈ మేరకు పెళ్లి కార్డు కూడా వైరల్ గా మారింది. చాలా గోప్యంగా ఈ వివాహం జరుగుతోంది. కానీ రిసెప్షన్ మాత్రం హైదరాబాద్ లో గ్రాండ్ గా చేయబోతున్నారట.

మార్చి 4వ తేదీన హైదరాబాద్ వేదికగా విజయ్ దేవరకొండ, రష్మికల రిసెప్షన్ నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ పెళ్లి నేపథ్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే, ఈ నెల చివరలో పెళ్లి చేసుకోబోతున్న విజయ్ దేవరకొండ, రష్మిక జంట గురించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నో ఫోన్ పాలసీని తెరపైకి తీసుకువచ్చేందుకు ఈ జంట నిర్ణయం తీసుకుందట. పెళ్లికి సంబంధించిన ఫోటోలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారట.

పెళ్లికి వచ్చిన అతిథులు ఫోటోలు తీయకుండా కండిషన్లు పెట్టబోతున్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే పెళ్లి పూర్తయిన తర్వాత తమ సోషల్ మీడియా వేదికగా ఫోటోలను పంచుకునేందుకు నిర్ణయం తీసుకుందట విజయ్, రష్మిక జంట. కానీ గెస్టులు మాత్రం ఫోటోలు తీయకుండా నో ఫోన్ పాలసీ తెరపైకి తీసుకు వచ్చినట్లు పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఇందులో ఎంత మేరకు వాస్తవం ఉందో తెలియాల్సి ఉంది.

## నిర్మాతగా ఇక నా పని అయిపోయింది



టాలీవుడ్‌లో బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకున్న నటి మంచు లక్ష్మి. నటన, హోస్టింగ్ మాత్రమే కాకుండా నిర్మాణ రంగంలోనూ ఆమె తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అయితే, తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు ఫిలీం నగర్‌లో చర్చనీయాంశంగా మారాయి. ప్రొడ్యూసర్‌గా తన కెరీర్‌కు ముగింపు పలికినట్లు ఆమె కుండబద్దలు కొట్టారు.

మంచు లక్ష్మి నటిగా ఎన్నో విభిన్న పాత్రల్లో మెప్పించినప్పటికీ, నిర్మాతగా మాత్రం ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయింది. అయితే తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆమె తన ఆవేదనను పంచుకుంటూ.. 'నిర్మాతగా నా జీవితంలో ఆ అధ్యాయం ముగిసిపోయింది. ఐదేళ్ల క్రితం నేను నిర్మించిన ఒక సినిమా మిగిల్చిన నష్టాలు ఇప్పటి వరకు నన్ను కోలుకోకుండా చేశాయి. ఆ సినిమా వల్ల వచ్చిన అప్పులను నేను ఇప్పటికీ కట్టుకుంటూనే ఉన్నాను. అందుకే ఇకపై నేను కేవలం నటనపైనే పూర్తి దృష్టి పెట్టలనుకుంటున్న. అంతే కానీ మళ్ళీ సినిమాలు నిర్మించే సాహసం మాత్రం చేయను. అందుకే ఇప్పుడు ఎవరైనా నా దగ్గరకు స్క్రిప్ట్ పట్టుకొని వస్తే, ముందుగా "నిర్మాత ఎవరు?" అని అడుగుతున్నా, నిర్మాత ఉన్నప్పుడే నాతో మాట్లాడమని చెప్తున్నా'అని ఆమె తెలిపారు. అంటే ఒక సినిమా ఫెయిల్యూర్ ఒక వ్యక్తి ఆర్థిక స్థితిని ఎలా దెబ్బతీస్తుందో మంచు లక్ష్మి మాటలో స్పష్టంగా తెలుస్తోంది . ప్రస్తుతం ఆమె ఇతర భాషా చిత్రాలతో పాటు వెబ్ సిరీస్‌లలో నటిస్తూ బిజీగా గడుపుతున్నారు.

## నిర్మాతగా నిత్యా మీనన్



ప్రముఖ నటి, జాతీయ అవార్డు గ్రహీత నిత్యా మీనన్ తన సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. నటిగా ఇప్పటికే విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారం ఎత్తుతున్నారు. 'కేయూరి ప్రొడక్షన్స్' పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియోలో తన నిర్మాణ సంస్థ లక్ష్యాలు, దృక్పథం గురించి నిత్యా మీనన్ స్పష్టత ఇచ్చారు. కేవలం వాణిజ్య పరమైన సినిమాలకే పరిమితం కాకుండా, బలమైన కథా నేపథ్యం ఉన్న చిత్రాలు, లోతైన భావోద్వేగాలను కలిగించే పాత్రలు, సమాజంపై ప్రభావం చూపగల కథాంశాలకే తన బ్యానర్ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

సినిమా అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, అది ప్రేక్షకులతో ఒక భావోద్వేగ బంధాన్ని ఏర్పరచే శక్తి కలిగిన మాధ్యమమని ఆమె అభిప్రాయపడ్డారు. గత ఏడాది వరుసగా మూడు విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన నిత్యా, ఇప్పుడు నిర్మాతగా కూడా తన ముద్ర వేయాలని సంకల్పించుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యానర్ కింద ఎలాంటి ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించకపోయినా, ముందుగా తనకు ఉన్న నటనా కమిట్‌మెంట్‌లను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. నటిగా కొనసాగుతూనే, అభిరుచి గల నిర్మాతగా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు.

విభిన్న కథలను ఎంచుకోవడంలో, ప్రయోగాత్మక పాత్రలను పోషించడంలో నిత్యా మీనన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇదే ధోరణిని నిర్మాతగా కూడా కొనసాగిస్తారని, కొత్త తరహా కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తారని చిత్ర పరిశ్రమ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఆమె ప్రారంభించిన ఈ కొత్త నిర్మాణ సంస్థ భవిష్యత్తులో కంటెంట్ ఆధారిత, నాణ్యమైన సినిమాలకు వేదికగా మారే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## సూర్యపై మమితా బైజు

## వైరల్ కామెంట్స్



ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే మంచి క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్స్‌లో మలయాళ తార మమితాబైజు ఒకరు. 'ప్రేమలు'తో ఒక్కసారిగా ఫేమస్ అయిన మమితా.. ప్రస్తుతం కోలీవుడ్, టాలీవుడ్, మాలీవుడ్‌లో ఆఫర్లు అందుకుంటోంది. ఇందులో భాగంగానే ప్రజెంట్ కోలీవుడ్ స్టార్ సూర్యతో ఓ సినిమా చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సూర్యపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'సూర్య, నేను 'సూర్య46' షూటింగ్‌లో చాలా సరదాగా గడిపాం. సూర్య సార్ ఎప్పుడూ స్పెషల్ కాఫీ తాగుతుంటారు. అది చాలా చాలా బాగుంటుంది. నేను ఆయన అసిస్టెంట్లను ఏ కాఫీ తాగుతున్నారో అడిగేదాన్ని. ఒకసారి నేను అడిగడం చూసిన సూర్య షూటింగ్ పూర్తయ్యే వరకు ప్రతిరోజూ ఆ కాఫీ నేను కూడా తాగేలా చూసుకున్నారు. ఇది చిన్న విషయమే కావచ్చు కానీ నాకు చాలా పెద్ద విషయం' అని తెలిపింది. కాగా.. సూర్య, మమితా జంటగా నటిస్తున్న చిత్రం 'సూర్య46'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రాబోతున్న ఒక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు జి.వి. ప్రకాష్ సంగీతం అందిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 2026 జూలైలో రిలీజ్‌కు సిద్ధం అవుతున్నది.